teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ...
తెలుగు దిన పత్రిక


ములుగు | సంపుటి : 04 | సంచిక : 194 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 11 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## జనవరి 28 నుండి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

ఏప్రిల్ 2 వరకు రెండు విడతల్లో నిర్వహణ

కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ఆమోదం



06



సంక్రాంతి వేళ రోడ్డెక్కిన

## నిరుద్యోగులు

- దిల్‌సుఖ్‌నగర్‌లో భారీ ఆందోళన
- ప్రభుత్వంపై ఒత్తిడికి యత్నం
- జాబ్ క్యాలెండర్ విడుదలకు డిమాండ్
- నిరసనకారులను అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): సంక్రాంతి పండగ వేళ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా హైదరాబాద్‌లో నిరుద్యోగులు మరోసారి రోడ్డెక్కారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేసి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయాలని

మిగతా 2 లో

# డేంజర్

## పిల్లల దగ్గుమందుపై అత్యవసర హెచ్చరిక

### అల్మాంట్ కిడ్ సిరప్ వాడితే ప్రాణాపాయం

### ల్యాబ్ పరీక్షల్లో బయటపడ్డ ఎథిలీన్ గ్లైకాల్

అధికారుల సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

దగ్గుమందులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. గతేడాది మధ్యప్రదేశ్ లో కోల్డ్ రిఫ్ దగ్గుమందు తాగి 20కి పైగా పిల్లలు చనిపోయారు. ఆ తర్వాత ఆ దగ్గుమందు తయారీ కంపెనీపై కేంద్రం చర్యలు తీసుకుంది. వాటి ఎగుమతులపై నిషేధం విధించింది. తాజాగా తెలంగాణలోనూ పిల్లల దగ్గుమందుపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. అల్మాంట్-కిడ్ సిరప్ ను వాడవద్దని హెచ్చరించింది. అది దగ్గు మందు కాదని, దగ్గుమందు రూపంలో ఉన్న స్లో పాయిజన్ అని తెలిపింది.



02



మున్సిపల్ ఎన్నికల బరిలో

## జనసేన

రాష్ట్రంలో రాజకీయ పునాదికి పవన్ కల్యాణ్ సిద్ధం

పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం

.. వివరాలు 2లో



## సంక్రాంతి ప్రయాణికులకు రైల్వే శాఖ కానుక

హైదరాబాద్ - విజయవాడ మధ్య 10 ప్రత్యేక రైళ్లు

రద్దీని తగ్గించేందుకు ముందస్తు నిర్ణయం

.. వివరాలు 5లో



మేడారం భక్తులకు

## ఆరోగ్య రక్ష

- 24 గంటల అత్యవసర సేవలు
- 35 అంబులెన్స్‌లు, 42 ప్రత్యేక వైద్య కేంద్రాలు
- 248 రకాల మందులతో సిద్ధంగా ఉన్న యంత్రాంగం
- వైద్య సేవల్లో లోటు ఉండొద్దు
- మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశం

02



చిరంజీవి సినిమా

## "టికెట్ ధరల పెంపుపై హైకోర్టులో పిటిషను

సంక్రాంతి రేసులో 'మన శంకర వరప్రసాద్ గారు'కు చుక్కెదురు

అధిక ధరలపై హౌస్ మోషన్ పిటిషన్

05



తెలంగాణను గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్ల గా

## మారుస్తాం

మంత్రి శ్రీధర్ బాబు ధీమా

హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణను గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్లగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ

మిగతా 2 లో



నాకింత విషమిచ్చి

## చంపేయండి

కానీ అధికారులపై అసత్యాలు రాయకండి

మంత్రి కోమటిరెడ్డి తీవ్ర ఆవేదన

మహిళా ఐఏఎస్‌లపై దుష్ప్రచారంపై ఆగ్రహం

05



ఖమ్మం వేదికగా సీపీఐ

## శతాబ్ది గర్జన

- ఈ నెల 18న కమ్యూనిస్టుల శక్తి ప్రదర్శన
- 10 వేల మందితో జనసేవాదళ్ కవాతు
- ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి
- 40 దేశాల నుండి ప్రతినిధుల రాక

హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందేళ్ల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలోని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్ మధ్యాహ్నం 3 గంటలకు

మిగతా 2 లో

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు

## బుద్ధి చెబుతారు

శిలాఫలకాలే తప్ప అభివృద్ధి సున్నా

బీఆర్ఎస్ శ్రేణులకు కేటీర్ దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): రానున్న పురపాలక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పట్టణ ప్రాంతాల ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని రెండు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ఏ పట్టణానికి చెల్లించని ఏకైక ప్రభుత్వంగా

మిగతా 6 లో

## మియాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

3,000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం

సర్వే నంబర్ 44లో 15 ఎకరాల భూమికి పక్కాగా ఫెన్సింగ్

భూ కబ్జాకు సహకరించిన సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు



05

## హార్వర్డ్‌లో ప్రసంగించనున్న కేటీఆర్

ప్రఖ్యాత ఇండియా కాన్ఫరెన్స్ కు అరుదైన ఆహ్వానం

మరోసారి అంతర్జాతీయ వేదికపై తెలంగాణ గళం

తెలంగాణ బ్యూరో, జనవరి 10 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ 23వ ఇండియా

మిగతా 6 లో



# భూపాలపల్లిలో సంక్రాంతి సంబరాలు

## ముగ్గుల పోటీలతో మెరిసిన బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం

### గండ్ర దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు

### విజేతలకు బహుమతుల ప్రదానం





భూపాలపల్లి, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ప్రకృతిని ఆరాధిస్తూ, సంస్కృతిని గౌరవించే సంక్రాంతి పండుగ వేళ భూపాలపల్లి జిల్లా కేంద్రం రంగురంగుల ముగ్గులతో మెరిసిపోయింది. తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల సృజనాత్మకతకు ప్రతిబింబంగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు అట్టహాసంగా సాగాయి. పార్టీ శ్రేణులు మరియు స్థానిక మహిళల భారీ స్పందన నడుమ ఈ వేడుక పండుగ వాతావరణాన్ని తలపించింది.

#### గెలుపు ఓటములకన్నా భాగస్వామ్యం ముఖ్యం

ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే మన పండుగ. మహిళల సృజనాత్మకతకు ఇది ఒక గొప్ప వేదిక. పార్టీ కార్యాలయం ముంగిట మహిళలు వేసిన ముగ్గులు మన సంప్రదాయాలను గుర్తుచేస్తున్నాయి అని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనడమే అసలైన విజయమని మహిళలను ప్రోత్సహించారు.

#### గండ్ర దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు

ఈ ముగ్గుల పోటీలకు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళలు వేసిన ముగ్గులను వారు తిలకించి, వారి నైపుణ్యాన్ని కొనియాడారు. కేవలం రంగులు చల్లడమే కాకుండా, ముగ్గుల్లో మన పల్లెటూరి జీవన విధానాన్ని, సంక్రాంతి వైభవాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దడం విశేషమన్నారు.

#### విజేతల వివరాలు - బహుమతుల ప్రదానం

పోటీలో అత్యంత ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు.

ప్రథమ బహుమతి: ఓజ్జపల్లి సుమలత (రూ. 5016/-)

ద్వితీయ బహుమతి: తోట సిరివల్లి (రూ. 3016/-)

తృతీయ బహుమతి: సిహెచ్ సరస్వతీ (రూ. 2016/-)

వీరితో పాటు దివ్య, మల్లీశ్వరి, శైలజ, రమ్య, స్వర్ణలతలకు చెరో రూ. 1000 చొప్పున కన్సలేషన్ బహుమతులు అందజేశారు. నిరాశ చెందకుండా ఉండేందుకు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు ప్రోత్సాహక బహుమతిని అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.

#### సంస్కృతి పరిరక్షణలో బిఆర్ఎస్

తెలంగాణ పండుగలకు, ఇక్కడి జీవనశైలికి బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా మహిళా లోకాన్ని ఏకం చేసే ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపాలిటీకి చెందిన మహిళలు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.
























# మేడారం భక్తులకు ఆరోగ్య రక్ష

హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారని ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు



అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.

#### 50 పడకల ప్రధాన హాస్పిటల్

జాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ దగ్గర 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన రూట్లలో, ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్-రూట్ మెడికల్ క్యాంపులను ఏర్పాట్ చేశారు. షిఫ్టుల వారీగా 24 గంటల పాటు వైద్య సేవలతో పాటు ఎమర్జెన్సీ కోసం 35 అంబులెన్స్ లు, 248 రకాల మందులు సర్జికల్ సామాగ్రిని సిద్ధం చేశామని తెలిపారు.

# డేంజర్

హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): దగ్గుమందులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. గతేడాది మధ్యప్రదేశ్ లో కోల్డ్ రిఫ్ దగ్గుమందు తాగి 20కి పైగా పిల్లలు చనిపోయారు. ఆ తర్వాత ఆ దగ్గుమందు తయారీ కంపెనీపై కేంద్రం చర్యలు తీసుకుంది. వాటి ఎగుమతులపై నిషేధం విధించింది. తాజాగా తెలంగాణలోనూ పిల్లల దగ్గుమందుపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. అల్మాంట్-కిడ్ సిరప్ ను వాడవద్దని హెచ్చరించింది. అది దగ్గు మందు కాదని, దగ్గుమందు రూపంలో ఉన్న స్లో పాయిజన్ అని తెలిపింది.

#### అత్యవసర హెచ్చరిక

ఈ దగ్గుమందులో ఎథిలీన్ గ్లైకాల్ కలిసినట్లు ల్యాబ్ పరీక్షల్లో తేలింది. దీంతో సిరప్ వినియోగాన్ని వెంటనే నిలిపివేయాల్సిందిగా తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ప్రజలకు అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. ఈ విషయాన్ని కేంద్ర ఔషధ ప్రమాద నియంత్రణ సంస్థ ఈస్ట్ జోన్, కోల్ కతా నుంచి వచ్చిన అలర్ట్ ఆధారంగా రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ శాఖ ప్రకటించింది. బిహార్ కు చెందిన ట్రిడస్ రెమిడీస్ అనే ఫార్మా సంస్థ తయారు చేసిన ~బా-24002 బ్యాచ్ సిరప్ శాంపిల్స్ ను పరిశీలించగా అత్యంత విషపూరితమైన ఎథిలీన్ గ్లైకాల్ ఉన్నట్లు తేలిందని అధికారులు వివరించారు. ఇది శరీరంలోని కిడ్నీలు, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదకరమైన కెమికల్ అని, పిల్లలకు ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అల్మాంట్ - కిడ్ సిరప్ ను ఎవరైనా కొనుగోలు చేసి ఉంటే దానిని వెంటనే వాడటం ఆపాలని సూచించారు. దీనిపై ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే నేరుగా రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ శాఖకు తెలియజేయవచ్చని, టోల్ ఫ్రీ నంబర్ 1800-599-6969 నంబరును అందుబాటులో ఉంచుతున్నామని తెలిపింది. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రతి ఒక్కరూ దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సిరప్ కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని డ్రగ్స్ కంట్రోల్ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ముున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేద్దాం

**ప్రభుత్వ పథకాలే అభ్యర్థులను మెజారిటీతో గెలిపిస్తాయి**

**శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**





పరకాల, జనవరి 10 (తీన్మార్ న్యూస్): పరకాల పట్టణానికి మౌలిక వసతులు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే నా లక్ష్యం, శనివారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహించారు. అంతకుముందు కార్యకర్తలకు మున్సిపల్ ఎన్నికలపై దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న పరకాల మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ గెలుపు కార్యకర్తలదేనని, ప్రతి ఒక్కరూ పాత కొత్త అని తేడా లేకుండా సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలే కాంగ్రెస్ బలమని, క్రమశిక్షణతో ముందుకు సాగాలని, పార్టీకి వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే సస్పెండ్ చేస్తామని అన్నారు. ఇప్పటికే టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని, గత ప్రభుత్వ పాలకులు అభివృద్ధి ముసుగులో దోచుకున్నారని అన్నారు.

# అరవింద పబ్లిక్ స్కూలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**ముగ్గులను పరిశీలిస్తున్న కరస్పాండెంట్ పంచకం నర్సయ్య**



ఖిలావరంగల్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య ముగ్గులు (రంగోలి), కైట్ ఫెస్టివల్ పోటీలను ప్రారంభించారు. పిండి, రంగు పొడులు, పువ్వులతో విద్యార్థులు వారి అద్భుతమైన కళా ప్రదర్శనలతో అందమైన ఆకృతులతో పోటిపడి వేసిన ముగ్గులు చూడముచ్చటగా ఉన్నాయి. గాలిపటాలు, ముగ్గులతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పంచకం నర్సయ్య మాట్లాడుతూ మన భారతీయ సంప్రదాయంలో ముగ్గు చాలా ప్రత్యేకమైన స్థానం కలిగి ఉందని, ఇంటి ఎదుట వేసే ముగ్గు కేవలం అలంకారమేగాక శుభప్రతీకం, సాంస్కృతిక విలువల ప్రతిబింబం కూడా అని అన్నారు. ఈ ముగ్గుల పోటీలు కేవలం కళా ప్రదర్శనలే కాదు; మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యత, ఆనందానికి ప్రతీకలు అని అన్నారు. విద్యార్థులలోని సృజనాత్మకత, కళాప్రతిభను వెలుగులోకి తీసుకొనిరాడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు కె అశ్విని, ఎ నర్మద, కె దివ్యశ్రీ, అఫ్రీన్, ఎ సుష్మిత, కె గౌతమి, ఎం రమ్య, జి లీనా శ్రీ, జి బాల ప్రభ, పి ప్రవంతి, పి సుప్రియ, కె కస్తూరి, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# దశ దినకర్మలో నివాళులర్పించిన బడే నాగజ్యోతి



తాడ్వాయి, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ములుగు నియోజకవర్గం తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన దానక సమ్మయ్య కుమార్తె అయిన శారద దేవి మరణించగా శనివారం వారియొక్క దశ దినకర్మలకు హాజరై చిత్రపటానికి పూలు వేసి నివాళ్ళర్పించి 5000 ఆర్థిక సహాయం చేశారు వారి యొక్క కుటుంబానికి తన యొక్క ప్రగడ సానుభూతి తెలిపిన ములుగు నియోజకవర్గ బీ ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ బడే నాగజ్యోతి, పార్టీ వారికి ఎల్లవేళల అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మరియు గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడారం జాతరలో ప్లాస్టిక్ వాడకండి




**పర్యావరణాన్ని రక్షించండి: మంత్రి సీతక్క**

ఎస్.ఎస్.తాడ్వాయి, జనవరి 10 (తీన్మార్ న్యూస్): పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్లాస్టిక్ ను వాడకండి. పర్యావరణాన్ని పరిరక్షించండి అనే గోడపత్రికలను మరియు జాతరకు వచ్చే భక్తులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వాడకండి. అనే కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం జాతరకు వచ్చే భక్తులు అటవీ ప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాస్, కవర్లను ఉపయోగించవద్దని అన్నారు. వాటి వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తాయని అన్నారు.

ప్లాస్టిక్ ప్లేట్స్ కవర్లలో వేడి, వేడి ఆహారం తీసుకోవద్దన్నారు. దానివల్ల జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే మేడారం జాతరలో భక్తులు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకుండా గాలి భూమి నీరును రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ రామ్నాథ్ సుధీర్ కేకన్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఏ.ఎస్.ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్, సభ్యులు రాము సేవక్, రవికాంత్, మరియు అటవీ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

**రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)**



ఎస్.ఎస్.తాడ్వాయి, జనవరి 10 (తీన్మార్ న్యూస్): వన దేవతల సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని భక్తులకు సాఫీగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,హాశిశు సంక్షమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ఎస్.ఎస్ తాడ్వాయి మండలం మేడారం లోని శ్రీ సమ్మక్క సారలమ్మ వన దేవతలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,హాశిశు సంక్షమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం మంత్రి సీతక్క ఆలయ ప్రాంగణ అభివృద్ధి పనులను, ఫ్లోరింగ్ పనులను, క్యూ లైన్ షేడ్స్ నిర్మాణాలను పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయాలని సంబధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సెలవు దినాలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం కలిగే విధంగా చూడాలని అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చేతుల మీదుగా గద్దెల పునః ప్రారంభం చేయడం జరుగుతుందని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. గద్దెల ప్రాంగణం విద్యుత్ కాంతుల వెలుగులతో ఆకర్షవంతగా కనిపించడం కోసం నూతన ఆధునిక విద్యుత్ దీపాలను అమర్చడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆలయ పూజారులు, గుత్తేదారులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్భాస్కర్**




హనుమకొండ, జనవరి 10 (తీన్మార్ న్యూస్): భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం బాలసముద్రం నందు శనివారం రోజున కార్మిక హక్కుల సాధన కోసం నిర్వహించనున్న జిల్లా స్థాయి సదస్సు సంబంధించిన పోస్టర్, కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులకు వ్యతిరేకంగా 4 నూతన చట్టాలను తీసుకొచ్చి కార్మిక, ఉద్యోగులకు కనీస హక్కులు లేకుండా కాలరాసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉద్యోగ, కార్మికులు ఎంత వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా 44 కార్మిక చట్టాలను రద్దు చేయడం కార్మిక సంక్షేమ వ్యతిరేక చర్య అని విమర్శించారు. పెట్టుబడిదారులు, సంపన్నుల కోసం పేదల పొట్టకొడుతున్న కేంద్ర ప్రభుత్వం, రైతులను, కార్మికులను నూతన చట్టాల పేరుతో మోసం చేయాలని ప్రయత్నిస్తోందని వివరించారు. కేంద్రం నూతనంగా తెచ్చిన 4 కార్మిక కోడ్ల కారణంగా కార్మికులు కనీసం వేతనం, సెలవులు, నిరసన చేసే హక్కులను సైతం కోల్పోతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలో రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తెస్తే రైతులు ఉద్యమానికి తలవంచిన కేంద్రం వాటిని వెనక్కి తీసుకోవడం జరిగిందని, ఆ రైతుల ఉద్యమ స్ఫూర్తితో కేంద్రంపై పోరాడుదామని పిలుపునిచ్చారు. 4 నూతన కార్మిక చట్టాల రద్దు కోసం భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్మికుల కోసం సదస్సును నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఉద్యోగుల, కార్మికల పొట్టకొడుతోందని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగుల రిటైర్డ్ బెనిఫిట్స్ సైతం చెల్లించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాల కారణంగా ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల పొట్టకొట్టి వారు ఆత్మహత్యలకు పాల్పడేలా చేస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా ఉద్యోగ, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**జిల్లా స్థాయి సదస్సు**

జనవరి 11 ఆదివారం రోజున బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో కార్మికుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సదస్సుకు మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్, మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, నగరంలోని అన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలు పాల్గొననున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు నాయిని రవి, ఎంజాల మల్లేశం, కార్మిక సంఘాల ప్రతినిధులు బొట్ల భిక్షపతి, నారాయణ గిరి, పాలడుగుల శివకుమార్, తేలు సారంగపాణి, తాళ్ల చేరాలు, సదానందం, రఘుపతి రెడ్డి, సాయి, వెంకటేశ్వర్లు, విజయ్, సిద్ధిఖ్, రాజు, ఇసంపెల్లి సంజీవ్, రవీందర్ రెడ్డి, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ వనదేవతల జాతరలను ఘనంగా నిర్వహించాలి

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి

## అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి

## జాతరలో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



జనగాం జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో సమ్మక్క సారలమ్మ జాతరలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో జరగనున్న మినీ సమ్మక్క సారలమ్మ జాతరల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతర కమిటీ చైర్మన్లను, సర్పంచులను జాతరలో చేయాల్సిన ఏర్పాట్లను, తీసుకోవాల్సిన చర్యలను అడిగి తెలుసుకున్నారు.

### వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ

భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా మినీ మేడారం జాతర ఏర్పాట్లు కొనసాగాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అధికారులకు సూచించారు. జాతర నిర్వహణలో ఎక్కడైనా లోటుపాట్లు ఉన్నట్లయితే వాటిని వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతర కావడంతో, కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేకంగా శానిటేషన్, త్రాగునీరు, రహదారులు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదు-పాయాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని, వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించాలని తెలిపారు.

### అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో జరిగే సమ్మక్క సారలమ్మ వనదేవతల జాతరలను ఘనంగా నిర్వహించాలని అన్నారు.నియోజకవర్గ పరిధిలో జాతరల నిర్వహణకు 54లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రతీ జాతరకు తహసీల్దార్ ఇంచార్జ్ గా విద్యుత్, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, పోలీస్ శాఖల అధికారులతో పాటు జాతర కమిటీ చైర్మన్లు, సర్పంచులుతో కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కమిటీ 12తేదీలోపు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రతిపాదనలు సిద్ధం చేసి 13వ తేదీన కలెక్టర్ గారికి అందించాలని సూచించారు. జాతరలో 24గంటలు విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతర ప్రాంతాలలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు.

### జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతరలను నిర్వహించాలని అన్నారు. తహసీల్దార్, ఎంపిడివోలు ఇంచార్జ్ గా కమిటీలు 12వ తేదీలోగా ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జాతర వద్దకు రోడ్డు ఫార్మేషన్, విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు, పారిశుధ్యం వంటి వసతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖలు సమర్థవంతంగా పని చేయాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా జాతరలను విజయవంతంగా నిర్వహించాలని ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఆర్డీవో వెంకన్న, ఏసీపీ భీమ్ శర్మ, వివిధ శాఖల ఎస్సిలు, డీఈలు, ఏఈలు, సిఐలు, ఎస్సైలు, సర్పంచులు, జాతర కమిటీ చైర్మన్లు, నాయకులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన నైపుణ్యాలతోనే యువతకు అవకాశాలు

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ పోతేనే యువత తమ భవిష్యత్తును అభివృద్ధి పథంలోకి తీసుకురాగలరని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో లెర్నెన్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే ఎంఆర్ఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి చీూఖీూ స్కీమ్ ద్వారా అప్రెంటిస్‌షిప్ శిక్షణతో పాటు, రేన్ (మద్రాస్) లిమిటెడ్ సంస్థ ద్వారా జచీజ మిషన్లపై అప్రెంటిస్‌షిప్ మరియు బ్యాచిలర్ / డిప్లొమా ఇన్--వోకేషనల్ కోర్సుల్లో రెండు సంవత్సరాల శిక్షణ కోసం నిర్వహించిన ఓరియెంటేషన్ ఉ సెలక్షన్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నైపుణ్యాలు ఉంటేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించాలనే లక్ష్యంతోనే ఈ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అప్రెంటిస్‌షిప్ శిక్షణలో ఉచిత శిక్షణతో పాటు స్టైపెండ్ సౌకర్యం, 100 శాతం ప్లేస్‌మెంట్ సపోర్ట్ అందిస్తున్నట్లు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మల్టీ స్కిల్స్ అవసరమని, యువత నిరంతరం నేర్చుకునే దృక్పథన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. యువత తమ లక్ష్యలను సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షంచారు. ఈ నేపథ్యంలో తన చిన్ననాటి అనుభవాలను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. తాను పేద కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగానని తెలిపారు. తన తండ్రి ఐటీఐ చదివారని, కుటుంబంలో పెద్దగా చదువుకున్న వారు ఎవరూ లేరని అన్నారు. తాను ఈ స్థితికి చేరుకోవడానికి ఎన్నో పనులు చేశానని, ఎంతో కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు ఉ ంటాయని, వాటికి భయపడి ఒకేచోట కూర్చుంటే విజయం దక్కదని అన్నారు. కష్టాలను అధిగమించి ఓర్పుతో ముందుకు వెళ్లిన వారే విజయతీరానికి చేరుకుంటారని పేర్కొన్నారు. ఈ అప్రెంటిస్‌షిప్‌లో మంచిగా శిక్షణ తీసుకొని, యువత ఉద్యోగాలను సాధించి జిల్లాకు, తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షంచారు. ఈ సెలక్షన్ ప్రోగ్రామ్‌కు హాజరుకాలేక పోయిన అభ్యర్థుల కోసం జనవరి 21న మరోసారి ట్రైనింగ్ & సెలక్షన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సెలక్షన్‌లో ఎంపిక కాలేకపోయినా అభ్యర్థులు నిరాశ చెందకుండా, మరింతగా ప్రిపేర్ అయి భవిష్యత్తులో ఇంకా మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 107 మంది యువకులు హాజరుకాగా, వీరిలో 92 మంది తమ వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించి, వారిలో 57 మందిని వివిధ ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఇందులో MRF Ltd. కంపెనీకి 39 మంది, Rane (Madras) Limited కంపెనీకి 14 మంది,టైచి కంపెనీకి 4 మంది యువకులు ఎంపికయ్యారని తెలిపారు. వీ=ఖీ కంపెనీలో శిక్షణ కాలంలో మొదటి సంవత్సరంలో నెలకు రూ.17,500, రెండో సంవత్సరంలో రూ.18,500, మూడో సంవత్సరంలో రూ.19,500 స్టైపెండ్ అందజేయబడుతుందని తెలిపారు. ఇందులో వసతి సౌకర్యం కోసం రూ.1,000, క్యాంటీన్ సదుపాయం కోసం రూ.350, బస్ సౌకర్యం కోసం రూ.500గా మొ-ంత్తం రూ.1,850 మినహాయించి మిగిలిన మొత్తాన్ని స్టైపెండ్ రూపంలో యువతకు చెల్లించబడుతుందని వివరించారు. రానే (మద్రాస్) కంపెనీ వారు శిక్షణ కాలంలో మొదటి సంవత్సరంలో నెలకు రూ.15,200, రెండో సంవత్సరంలో రూ.16,200 స్టైపెండ్ అందజేస్తా రని, శిక్షణ పూర్తయిన అనంతరం ఎంపికైన యువతకు ప్రారంభ జీతంగా నెలకు రూ.22,000 చెల్లించబడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీ=ఖీ కంపెనీ సూపర్‌వైజర్ అమృత్ రాజు, రానే మద్రాస్ కంపెనీ నుండి రిక్రూట్‌మెంట్ -- అసిస్టెంట్ మేనేజర్ బిస్వజిట్ ఖుంటియా, SERP నుండి బి.నీలయ్య, ఏపిఎంలు ఎల్.వెంకయ్య, జి. ప్రసాద్ రెడ్డి, ఏ. నాగేశ్వర రావు, ఈ.డి.యం కలెక్టరేట్ టెక్నికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



# మల్లంపల్లి బ్రిడ్జి పనులను పరిశీలించిన మంత్రి సీతక్క



మల్లంపల్లి, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా పరిధిలోని మల్లంపల్లి బ్రిడ్జి నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్,సంబంధిత అధికారులను ఆదేశించారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులు, యాత్రికులకు ఈ బ్రిడ్జి అత్యంత కీలకంగా ఉండటంతో జాతర ప్రారంభానికి ముందే వాహన రాకపోకలకు అనుకూలంగా బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సూచించారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల ట్రాఫిక్ కు అలాంటి అంతరాయం కలగకుండా తాత్కాలిక మార్గాలు, భద్రతా ఏర్పాట్లు చేయాలని పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు మేడారం జాతర రవాణా సౌలభ్యం అత్యంత ప్రాధాన్యమని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి,ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి బ్రిడ్జి నిర్మాణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల స్టాల్స్ ప్రారంభించిన రాష్ట్ర మంత్రి సీతక్క





తాడ్వాయి, జనవరి 10 (తీన్మార్ న్యూస్): ఇందిరా మహిళా శక్తి ద్వారా మేడారం జాతర సందర్భంగా జీవనోపాధి కోసం మహిళా సంఘాల వారికి స్టాల్స్ ఏర్పాటు చేయగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొని ప్రారంబించారు. ములుగు మండలం పరిధిలోని ఇంచార్ల క్రాస్,జంగాలపల్లి క్రాస్, ఎర్రిగట్టమ్మ ప్రాంతాల్లో మహిళా సంఘాల చేత ఏర్పాటు చేసిన వివిధ రకాల వ్యాపార స్టాల్స్ ను రాష్ట్ర మంత్రి సీతక్క ప్రారంబించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఇంచర్ల ఎర్రిగట్టమ్మ వద్ద ఏర్పాటు చేసిన టీ స్టాల్,జంగాలపల్లి క్రాస్ వద్ద బొంగు చికెన్,నాటు కోళ్ల అమ్మకం, కూరగాయలు, పండ్లు విక్రయించే స్టాల్స్ మంత్రి సీతక్క ప్రారంభించి జాతర భక్తులకు స్వయంగా టీ విక్రయించారు. అదే విధంగా జాకారం,మల్లంపల్లి లో ఏర్పాటు చేసిన డైరీ పార్లర్&కిరణం స్టాల్, టి స్టాల్ & కిరణం స్టాల్స్ మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంబించారు. జాతరతో పాటు అన్ని ప్రధాన రూట్లలో మహిళా సంఘాల చేత స్టాల్స్ చేసే వారికి ఆర్థిక అబివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా సహకారం అందిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.మహిళలు స్వయం ఉపాధితో బలోపేతం కావాలని ,జాతర వంటి పెద్ద అవకాశాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# డ్రైవర్లకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం



మహబూబాబాద్ జిల్లా, జనవరి 10 (తీన్మార్ న్యూస్): రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ వాహన డ్రైవర్లకు హెల్మెట్ వాడకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కగా పాటించడం, జీబ్రా క్రాసింగ్ లను వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించడం, వాహనాలను ఓవర్టేక్ చేయడం, రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలం లలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అందరికీ అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి షాలినీ షకేలీ అన్నారు. ఈ కార్యక్రమములో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ సాయి చరణ్, వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ ఐ అరుణ్ నిర్వహించరు.

# అంబేద్కర్ భవన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి

## ఏప్రిల్ 14 లోపు భవన నిర్మాణం పూర్తి చేయాలి

## ఎమ్మెల్యే మాట ప్రకారం తక్షణమే పూర్తి చేయాలి

## మారపెల్లి క్రాంతి కుమార్ బిఎస్ఎస్ అధ్యక్షులు



శాయంపేట,జనవరి 10 (తీన్మార్ న్యూస్): శనివారం శాయంపేట మండల కేంద్రం రైతు వేదిక భవనం ప్రక్కన ప్రభుత్వ స్థలంలో అంబేద్కర్ భవనాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేని కోరడం జరిగింది. ఈ సందర్భంగా మారపెల్లి క్రాంతి కుమార్ బి ఎస్ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, దళిత నాయకులు అరికెళ్ల దేవయ్య మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం కోసం దాదాపు 5 సంవత్సరాల క్రితం ప్రభుత్వ స్థలం పశువుల దవాఖాన ముందు ముళ్ళ కంచెలతో ఉన్నటువంటి చెట్లను తొలగించి ఎంతో కష్టంతో ఈ స్థలంలో అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని అంబేద్కర్ గారి జయంతిని వర్ధంతిని ఈ స్థలంలోనే కార్యక్రమాలు నిర్వహించే వాళ్ళం, అదేవిధంగా అప్పటి ఎమ్మెల్యే కి ఎన్నో మార్లు భవనాన్ని ఏర్పాటు చేయాలని వారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం శూన్యం, ఆ తర్వాత ఎమ్మెల్యేగా గౌరవనీయులు గండ్ర సత్యనారాయణ రావు కి దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనాన్ని 50 లక్షలతో నిర్మించాలని అంబేద్కర్ గారి జయంతి సాక్షగా విన్నవించడం జరిగింది, దానికి వారు స్పందిస్తూ తక్షణమే తాసిల్దార్ కి కూడా చెప్పడం జరిగింది, ఆరోజు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ భవనాన్ని వచ్చే అంబేద్కర్ జయంతి నాటికి అందరం కూడా కలిసి అదే భవనంలో జయంతిని ఘనంగా జరుపుకుందామని చెప్పడంతో సంతోషించడం జరిగింది, కానీ వారు చెప్పి సంవత్సరం కావస్తుంది కానీ ఇప్పటివరకు ఈ స్థలంలో కనీసం శంకుస్థాపన గాని ఎటువంటి పని గానీ జరగకపోవడం బాధాకరం, ఇప్పటికైనా తక్షణమే వారు స్పందించి భవన నిర్మాణ పనులను చేపట్టాలని, ఏప్రిల్ 14వ తేదీ 2026వ తేదీ నాటికి అందరం కూడా ఇదే భవనంలో కార్యక్రమాన్ని జరిపించుకునే రకంగా పనులను త్వరితగతిన చేపట్టాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మోగ్గం సుమన్ బి ఎస్ ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, మారపల్లి విజయ్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు, మారపల్లి సుధాకర్ మండల అధ్యక్షులు, దళిత నాయకులు మొగిలి, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

# సంక్రాంతి వేళ రోడ్డెక్కిన నిరుద్యోగులు

మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేస్తూ భారీ సంఖ్యలో యువత నిరసనకు దిగింది. శనివారం దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టిన నిరుద్యోగులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇప్పటికే అనేకసార్లు హామీలు ఇచ్చినా ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. పండగ సమయమైనప్పటికీ తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నిరుద్యోగులు హెచ్చరించారు.

# చిరంజీవి సినిమా “టికెట్ ధరల పెంపుపై హైకోర్టులో పిటిషను

హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): మెగాస్టార్ చిరంజీవి న్యూ మూవీ మన శంకర వరప్రసాద్ గారు పై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ సినిమా టికెట్ ధరల పెంపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ శనివారం న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సెలవు తర్వాత విచారిస్తామన తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. కాగా అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ మూవీ సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలోనే మూవీకి సంబంధించి టికెట్ ధరలను పెంచుతూ తాజాగా తెలంగాణ సర్కార్ అనుమతి ఇచ్చింది. వారం రోజుల పాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సాధారణ టికెట్ ధరపై జీఎస్టీతో కలిపి రూ.50, మల్టీప్లెక్స్‌లలో సాధారణ టికెట్ ధరపై జీఎస్టీతో కలిపి రూ.100 అదనంగా పెంచుకునేందుకు పర్మిషన్ ఇచ్చారు. రోజుకు 5 షోలు ప్రదర్శించుకోవడానికి కూడా సర్కార్ వెసులుబాటు కల్పించింది. అలాగే జనవరి 11న సాయంత్రం 8 గంటల నుంచి రాష్ట్రంలో స్పెషల్ ప్రీమియర్ షోలకు ప్రదర్శించుకోవచ్చని అందుకు టికెట్ రేటును రూ.600గా నిర్ణయించినట్లుగా ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నారు.

# తెలంగాణను గ్లోబల్ ‘ఇన్నోవేషన్ క్యాపిటల్ గా మారుస్తాం మంత్రి శ్రీధర్ బాబు ధీమా

మొదటి పేజీ తరువాయి




మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. టెక్నాలజీ కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, దేశ సేవకు, ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలన్నారు. శనివారం బిట్స్ పిలానీ–హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహించిన ‘బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ గ్లోబల్ మీట్ 2026’కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇతర దేశాలు ప్రైవేట్ గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తే, భారత్ మాత్రం ఆధార్, యూపీఐ వంటి ‘డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ల ద్వారా ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఏఐ ఆధారిత ‘తెలంగాణ డేటా ఎక్స్‌ఛేంజ్ల పరిశోధనలకు గొప్ప ఊతమిస్తోందన్నారు. త్వరలో ప్రారంభించబోయే తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ యూనివర్సిటీలు గేమ్ ఛేంజర్‌గా మారి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తాయన్నారు.

**క్రియేటివ్ థింకర్స్‌కే మార్కెట్లో జాబ్**

ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఇంటెలిజెన్స్ కంటే కో–ఆర్డినేషన్ అత్యంత ఖరీదైనదిగా మారిందన్నారు. ఏఐ వినియోగంలో డేటా ప్రైవసీ, ఎథిక్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా ఆర్అండ్‌డీపై దృష్టి సారించాలని టెక్ కంపెనీలను కోరారు. ఒకప్పుడు స్కేల్, స్పీడ్, వాల్యుయేషన్ ప్రాతిపదికన కంపెనీల సక్సెస్ నిర్ణయించబడేదని ఇప్పుడు ఆర్కిటెక్చర్, డేటా ఓనర్ షిప్, డెసిషన్ స్పీడ్, నమ్మకంపైనే వాటి మనుగడ ఆధారపడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేవలం కోడింగ్ తెలిసిన వారి కంటే, సమస్య మూలాలను గుర్తించి పరిష్కరించగల ‘క్రియేటివ్ థింకర్ల్నకే జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని తెలిపారు.

# నాకింత విషమిచ్చి చంపేయండి




హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): మంత్రులు, మహిళా ఐఏఎస్ ఆఫీసర్ల మీద వస్తున్న ఆరోపణలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఖండించారు. నాపై ఏమైనా రాయాలనుకుంటే రాయండి తట్టుకుంటా. కానీ మహిళా అధికారులపై ఇష్టమొచ్చినట్లు వార్తలు రాయొద్దని మీడియాను కోరారు. ప్రతీ ఒక్కరికీ కుటుంబం ఉంటుంది. అడ్డగోలు రాతలు మంచివి కాదన్నారు. ఇవాళ హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడిన ఆయన ఓ మహిళా ఐఏఎస్ పై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరం అని పేర్కొన్నారు. మీడియాలో మీరంతా నా పాత మిత్రులే. నా గురించి మీ అందరికీ తెలుసు. అయినా నన్ను ఇలా మానసికంగా హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నా కొడుకు చనిపోయినప్పుడే నేను సగం చనిపోయాను. అప్పుడే రాజకీయాలు వదిలేస్తే బాగుండేది. కానీ ఆ తర్వాత నా కొడుకు పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి పేదలకు సహాయం చేస్తున్నాను.

**ఇంత విషమివ్వండి:**

అయినా నన్ను మానసికంగా ఇబ్బంది పెట్టి, నా ఇంట్లో ఇబ్బందులు పెట్టి, మహిళా ఆఫీసర్లను ఇబ్బంది పెట్టి మీరు ఏం సాధిద్దామని అనుకుంటున్నారని మంత్రి మీడియాను ఉద్దేశించి ప్రశ్నించారు. మీ రేటింగ్‌లు, వ్యూస్ కోసం అవాస్తవాలు రాయడం సరికాదు. ఛానల్ల మధ్య పోటీ కోసం మహిళా అధికారులను ఇబ్బంది పెట్టొద్దు. ఇది సరైనదే అనుకుంటే కంటిన్యూ చేయండి. ఇంకా సరిపోదు అనుకుంటే నాకింత విషమిచ్చి చంపేయండి అని ఆవేదన వ్యక్తం చేశారు. నేను నా ఫోన్ నంబర్ మార్చానని ఓ చానల్ లో ప్రసారం చేశారు. ఆ నంబర్ చాలా పాతది. దాదాపు 20 ఏళ్లకు పైగా ఆ నంబర్ వాడుతున్నాను. అందరి వద్ద ఆ నంబర్ ఉండటంతో అందరు దానికే ఫోన్ చేస్తున్నారు. దాంతో పీఏ వద్ద ఉంచాను. తనకు గొంతులో అనారోగ్య సమస్య ఉందని దాని కోసం అమెరికాకు వెళ్లి వైద్యం చేయించుకున్నా తగ్గడం లేదన్నారు. పుట్టుకతోనే ఉన్న ఈ సమస్యకు తక్కువ మాట్లాడటమే పరిష్కారం అని వైద్యులు సూచించారు. అందుకే తాను తక్కువ ఫోన్ మాట్లాడుతానని చెప్పాను. ఆ నంబర్ తోనే నేను ఆరుసార్లు గెలిచాను. దాన్ని ఎలా పక్కన పెడతానన్నారు. ఎంతో కష్టపడితే ఐఏఎస్‌లు అవుతారు. అలాంటి వారిపై ఆఫీసర్ల మీద అభియోగాలు కరెక్ట కాదన్నారు.

**సమగ్ర దర్యాప్తు చేయమని సీఎంను కోరుతున్న:**

కలెక్టర్ల బదిలీలు సీఎం స్థాయిలో జరుగుతుంది. నా జిల్లాలోనే కాదు చాలా జిల్లాల్లో కలెక్టర్ల బదిలీ జరిగింది. నేను మంత్రిని అయ్యాక నల్గొండ జిల్లాల్లో నలుగురు కలెక్టర్లు మారారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. అధికారుల మీద అభాండాలు వేయడం మంచిది కాదన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం తరపున సమగ్ర దర్యాప్తు జరపాలని సీఎంని కోరుతున్నానన్నారు.

# ఖమ్మం వేదికగా సీపీఐ శతాబ్ది గర్జన



మొదటి పేజీ తరువాయి

లక్షలాది మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు వామపక్ష పార్టీల అగ్ర నాయకులు, సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు. భారత్‌లో కమ్యూనిజం ఎక్కడ ఉన్నదనే వారికి ‘సీపీఐ ఖమ్మం బహిరంగ సభ’ ఒక రుజువుగా నిలువనుందన్నారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల నేపథ్యంలో హైదరాబాద్ జర్నలిస్టులతో శనివారం కూనంనేని సాంబశివరావు ఇష్టాగోష్టిలో మాట్లాడారు. ఖమ్మం బహిరంగ సభకు ఏపీ, కేరళ, తమిళనాడుతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరానున్నారని, ప్రజలు స్వచ్ఛందంగా రవాణా సౌకర్యాన్ని కల్పించుకుని వస్తున్నారని ఆయన తెలిపారు.

**వేల మందితో ‘జనసేవాదళ్ కవాతు’**

బహిరంగ సభకు ముందు పదివేల మందితో ‘జనసేవాదళ్ కవాతు’ను నిర్వహించనున్నామని, ఆ తర్వాత సభ జరుగుతుందని తెలిపారు. మరుసటి రోజు 19వ తేదీన జాతీయ సదస్సును నిర్వహిస్తామని, అలాగే ఈనెల 19, 20, 21న సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం, కార్యవర్గ, సమితి సమావేశాలను నిర్వహించనున్నట్టు కూనంనేని వివరించారు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి భిన్నంగా కాకుండా మారుతున్న కొత్త పద్ధతులు, వివిధ దేశాల పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసుకుంటూ శ్రీలంక, నేపాల్ ఇలా పలు దేశాలలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చాయని, చిన్నపాటి సమస్యలు వచ్చినా పరిష్కరించుకూంటూ ఐక్యంగా ముందుకు వెళు న్నారని ఆయన వివరించారు. భారతదేశంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పరిస్థితులు, కగార్ ఆపరేషన్, కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ ఇలాంటి సందర్భంలో కమ్యూనిస్టు పార్టీలన్నీ కలిస్తే బాగుటుందని అందరూ కోరుకుంటున్నారని, కమ్యూనిస్టు పార్టీలలో ఐక్యత రావాలని చాలా మంది చెబుతున్నారని కూనంనేని సాంబశివ రావు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల బరిలో జనసేన

తెలంగాణ బ్యూరో, జనవరి 10 (తీన్మార్ న్యూస్): జనసేన కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే తెలంగాణ మన్సిపల్ ఎన్నికల్లో బరిలో దిగాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవున్నట్టు ప్రకటించింది. ఎన్నికలకు నెల రోజుల కంటే తక్కువ సమయం ఉన్నప్పటికీ సాధ్యమైనన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులు బరిలో దిగుతున్నట్టు తెలిపింది. ప్రతి జనసైనికుడు, వీర మహిళ ఉత్సాహంగా ప్రచారానికి సిద్ధం కావాలని ప్రకటించింది. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడం, అధ్యక్షుడు పవన్ కల్యాణ్ భావజాలాన్ని ప్రజల్లోకి చేరవేయడం ద్వారా రాష్ట్రంలో సరికొత్త రాజకీయ వేధికకు పునాధి వేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించింది. త్వరలోనే పార్టీ కార్యచరణ ప్రకటిస్తామని పేర్కొంది.

# జనవరి 28 నుండి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

న్యూ ఢిల్లీ, జనవరి 10 (తీన్మార్ న్యూస్): పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28 నుండి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల మొదటి దశ ఫిబ్రవరి 13న ముగుస్తుంది. మార్చి 9న రెండవ దశ కోసం పార్లమెంటు తిరిగి సమావేశమవుతుందని ఆయన అన్నారు. అర్థవంతమైన చర్చ మరియు ప్రజా–కేంద్రీకృత పాలన వైపు ఇది ఒక కీలకమైన అడుగు అని శ్రీ రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు, 2026 బడ్జెట్ సమావేశానికి పార్లమెంటు ఉభయ సభలను పిలవడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని మంత్రి తెలియజేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో “కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారు”

మొదటి పేజీ తరువాయి

చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిపోతుందని అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో పట్టణాల్లో పరిపాలన పూర్తిగా పడకేసిందని పారిశుధ్యం నుంచి మొదలుకొని ప్రతి అంశంలో పట్టణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

**కేటీఆర్ ఆవేదన**

గత ప్రభుత్వం కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం తప్పించి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి కూడా లేదన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, కమ్యూనిటీ హాల్, మోడల్ మార్కెట్ల వంటి ప్రతి ఒక్క కార్యక్రమానికి నిధులు ఆపివేయడంతో అన్ని కార్యక్రమాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను వ్యవసాయనం గాని సంక్షభంలోకి నేడుతూ మరోవైపు పట్టణాలను పడుకోబెట్టి ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుందన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో ఆయా పట్టణాలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఇచ్చిన నిధులను వివరించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీ నేతలకు కేటీఆర్ సవాలు చేశారు.

**మంచి ఫలితాలు సాధించాం**

మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే క్రమంలో భాగంగా శనివారం నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నహక సమావేశం నిర్వహించారు. పురపాలక ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాల పైన దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పార్టీ తరపున చేసుకోవాల్సిన ఏర్పాట్లను ప్రజల ముందు ఉంచాల్సిన వివిధ అంశాలను కేటీఆర్ ఈ సందర్భంగా పార్టీ నేతలకు తెలియజేశారు. రెండు జిల్లాలకు సంబంధించిన ప్రతి మున్సిపాలిటీలోని క్షత్రస్థాయి పరిస్థితుల పైన క్షణ్ణంగా సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలను అధికార దుర్వినియోగాన్ని తట్టుకొని మంచి ఫలితాలు



సాధించామని ఇదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

**హరీష్ రావు దిశానిర్దేశం**

జిల్లా పార్టీ అధ్యక్షులు ప్రజాప్రతినిధులు పార్టీ సీనియర్ నాయకులు హాజరైన ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేత శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు కూడా పలు అంశాల పైన నేతలకు దిశా నిర్దేశం చేశారు. కలిసికట్టుగా సమిష్టిగా కొట్లాడి ఎన్నికల్లో మంచి విజయం నమోదు చేయాలని హరీష్ రావు అన్నారు. ఈ సందర్భంగా పురపాలక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం పైన పలు అంశాలను హరీష్ రావు నేతలకు వివరించారు. ఈ సమావేశాల సందర్భంగా ఆయా జిల్లాల నేతలు క్షత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పార్టీ సీనియర్ నేతలకు వివరించారు. ప్రభుత్వం పైన క్షత్రస్థాయిలో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నదని పార్టీకి అనుకూల వాతావరణం ఉన్నదని తెలిపారు.

**హార్వర్డ్‌లో ప్రసంగించనున్న కేటీఆర్**

మొదటి పేజీ తరువాయి

కాన్ఫరెన్స్ ఎట్ హార్వర్డ్ లో ప్రసంగించాల్సిందిగా యూనివర్సిటీ ఆహ్వానించింది. ది ఇండియా వీ ఇమేజనీ” అనే థీమ్‌తో ఈ సదస్సు ఫిబ్రవరి 14, 15 తేదీల్లో హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించబోతున్నారు. ఈ కాన్ఫరెన్స్ అమెరికాలో జరిగే అతిపెద్ద విద్యార్థుల ఆధ్వర్యంలోని ఇండియా కాన్ఫరెన్స్‌లలో ఒకటిగా గుర్తింపు పొందింది. భారత్‌తో పాటు దక్షణ ఆసియా దేశాల నుంచి వచ్చిన విద్యార్థులు, వ్యాపారవేత్తలు, సాంస్కృతిక రంగ ప్రముఖులు కలిపి వెయ్యిమందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారు.

రెండో రోజు కేటీఆర్:

సదస్సులో భాగంగా మొదటి రోజు ఫిబ్రవరి 14న హార్వర్డ్ కెనెడీ స్కూల్‌లో పాలన, అభివృద్ధి, పబ్లిక్ పాలసీపై, ఫిబ్రవరి 15 హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో వ్యాపారం, ఆంత్రప్రెన్యూర్‌షిప్, గ్లోబల్ ఎకానమీపై చర్చలు జరగనున్నాయి. డే–2లో ప్రసంగించాలని కేటీఆర్‌ను నిర్వాహకులు కోరారు. కాగా తెలంగాణను భారతదేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టడంలో కేటీఆర్ పోషించిన కీలక పాత్రకు గాను హార్వర్డ్ యూనివర్సిటీ ఈ ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నది. హైదరాబాద్ ఐటీ ఎకోసిస్టమ్ విస్తరణ, స్టార్టప్ సంస్కృతి అభివృద్ధి, డిజిటల్ గవర్నెన్స్, అర్బన్ ఇన్నోవేషన్, ఇండస్ట్రీ ఆధారిత ఉద్యోగాల సృష్టి వంటి రంగాల్లో కేటీఆర్ నాయకత్వం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిందని ఆహ్వాన పత్రంలో పేర్కొన్నారు. గతంలో ఈ వేదికపై నీతా అంబానీ, నితిన్ గడ్కరీ, అజీమ్ ప్రేమ్‌జీ, అజయ్ బంగా, జైరాం రమేష్, రాధికా గుప్తా, కరిష్మా కపూర్, సబ్యసాచి వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు ప్రసంగించారు.

# సంక్రాంతి శుభక్రాంతి

సూర్యుడు ఒక రాశి నుంచి మరొక రాశికి మారడాన్ని 'సంక్రమణం' అంటారు. అలా మకర రాశిలో ప్రవేశించే శుభ సందర్భం... మకర సంక్రమణం. ఆ రోజు నుంచే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభంఅవుతుంది. సంక్రాంతి అనే పదంలో 'సం' అంటే శుభం, 'క్రాంతి' అంటే పరివర్తన లేదా విప్లవం. 'సంక్రాంతి' అంటే శుభ పరివర్తన కలిగే రోజు.

సకల జీవరాశికి ప్రాణాధారం సూర్యుడు. ఆయన అనుగ్రహం లేకపోతే ప్రాణికోటికి మనుగడ లేదు. కాబట్టి ఆయనకు నిరంతరం మనం కృతజ్ఞతలు తెలుపుకొంటూ ఉండాలి. మకర సంక్రాంతి రోజున... అప్పటివరకూ దక్షిణంవైపు ప్రయాణించిన సూర్యుడు తన దిశను మార్చుకొని ఉత్తరంవైపు సంచారం ఆరంభిస్తాడు. సూర్యుడి గమనం మారడం వల్ల వాతావరణంలో మార్పులు సంభవిస్తాయి. సూర్యుడు నిరంతరం జ్వలిస్తూ సమస్త విశ్వానికి మేలు చేకూరుస్తాడు. అందరికీ ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు. ఇదంతా చేసేది తానే అనుకోకుండానే... దీన్నంతటినీ ఆయన నిర్వహిస్తాడు. ఈ గుణాలను మనలో పెంపొందించుకుంటే అహంకారానికి తావు ఉండదు.

## సమతుల్యత కావాలి...

మకర సంక్రాంతి విశిష్టమైన పండుగ. పండిన పంటలు ఇంటికి చేరే సమయంలో... నిర్వహించుకొనే వేడుక. మనకు ఆహారాన్ని ప్రసాదించే నేల తల్లికి కృతజ్ఞతలు తెలుపుకొనే సందర్భం. మిగిలిన పండుగలన్నిటినీ మనం చంద్రుడి గమనం ఆధారంగా... చాంద్రమాన పద్ధతిలో జరుపుకొంటాం. కానీ సంక్రాంతి సూర్య గమనం ఆధారంగా, సౌరమానం ప్రకారం జరుపుకొనే పండుగ. సూర్య చంద్రుల గమన ప్రభావం మనమీద బాహ్యపరంగానే కాదు... మన అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థ మీద కూడా ఉంటుంది. మనలో ఎడమవైపు ఇడానాడి అంటే చంద్రనాడి, కుడివైపు పింగళనాడి అంటే సూర్యనాడి ఉంటాయి. సూర్యనాడి క్రియా శక్తిని, చంద్రనాడి ఇచ్ఛాశక్తిని సూచిస్తాయి. మనం మన శక్తికి మించిన పని చేసినప్పుడు లేదా అతిగా ఆలోచిస్తున్నప్పుడు... కుడిపార్శ్వం మీద... అంటే సూర్యనాడి మీద భారం పడుతుంది. అలాగని ఏ పనీ



చేయాలనే కోరిక లేకుండా, ఎప్పుడూ సోమరితనంతో ఉండేవారిలో ఎడమ పార్శ్వానికి అంటే చంద్రనాడికి సమస్యలు వస్తాయి. ధ్యానం ద్వారా సూర్యనాడిని, చంద్రనాడిని సమతుల్య స్థితిలో ఉంచుకోవాలి. ఇది సహజయోగ ధ్యానం ద్వారా సాధ్యమవుతుంది.

## ఆప్యాయతను పంచే సంకేతం

మన దేశంలోని పలు రాష్ట్రాల్లో, ప్రత్యేకించి పల్లె ప్రాంతాల్లో సంక్రాంతిని ప్రధానమైన పండుగగా ఘనంగా నిర్వహిస్తారు.



మొదటిరోజున భోగి, రెండోరోజున మకర సంక్రాంతి, మూడో రోజున కనుమ పండుగలను జరుపుకొంటారు. ఏడాదంతా కష్టపడి పండించిన ధాన్యం సంక్రాంతి సమయానికి పొలాల నుంచి ఇళ్ళకు చేరుకుంటుంది. ధాన్య లక్ష్మికి స్వాగతం చెప్పేందుకు ఇంటి గుమ్మాలను మామిడి తోరణాలతో, పూల దండలతో అలంకరిస్తారు. వాకిళ్ళలో అందమైన రంగవల్లులు దిద్దుతారు. ఆ ముగ్గులలో ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను పెడతారు. కొత్త బియ్యంతో పొంగలి చేసి, నైవేద్యాలు పెడతారు. అందుకే ఈ పండుగను 'పొంగల్' అని కూడా పిలుస్తారు. సంక్రాంతి పండుగ రోజున చాలా రాష్ట్రాల్లో నువ్వులు, బెల్లంతో పిండి వంటలు చేస్తారు. ఇది ఎంతో శాస్త్రీయ-ంమైన సంప్రదాయం. సూర్యరశ్మిలోని అతి ఉష్ణం కోపాన్ని పెంచుతుంది, దానివల్ల మాటల్లో కరుకుదనం ఏర్పడుతుంది. కాబట్టి తియ్యని బెల్లాన్ని నువ్వులతో కలిపి ఇతరులకు పంచడం వల్ల ఆత్మీయత పెరిగి, మాటల్లో మాధుర్యం వెల్లివిరుస్తుందని పెద్దలు చెప్పారు. అంటే ఇతరులకు ఆప్యాయతను పంచే ఒక సంకేతం ఇది. జానపద కళా సంప్రదాయాలైన గంగిరెద్దుల ఆట, హరిదాసుల కీర్తనలు లాంటివి ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. కనుమ రైతులకు అత్యంత ప్రీతిపాత్రమైనది. కృషి వ్యవస్థకు మూలాధారమైన పశువులకు కృతజ్ఞతతో పూజలు చేయడం ఆనవాయితీ. మన శరీరం పంచభూతాలతో నిర్మితమైనది కాబట్టి... సహజయోగ సాధన ద్వారా మనం సమతుల్య స్థితిలో ఉంటూ, ప్రకృతితో మమేకం కావాలి. ప్రకృతి ధర్మాలను అనుసరించాలి. మనలో ఆధ్యాత్మికతను అభివృద్ధి చేసుకోవాలి.

# సంక్రాంతి పండుగకు ఊరెళ్తున్నారా..?

**సోషల్ మీడియాలో ప్రయాణ వివరాలు షేర్ చేయవద్దు**

**ఇంటి భద్రతపై సీపీ సజ్జనార్ కీలక సూచనలు**



హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నగర ప్రజలకు పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. పండుగకు ఊర్లకు వెళ్లే వారు ఇంటి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పండుగ వేళ తాళం వేసి ఉన్న ఇళ్లపైనే దొంగల కన్ను ఉంటుందని హెచ్చరించారు. శనివారం ఎక్స్ వేదికగా స్పందించిన సీపీ సజ్జనార్, నగదు, విలువైన ఆభరణాలను బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో ప్రయాణానికి సంబంధించిన అప్‌డేట్స్ పోస్టు చేయవద్దని, ఇంటి వద్ద ఎవరూ లేరని దొంగలకు సంకేతాలు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఊరు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని తెలిపారు. మీ భద్రతే మా బాధ్యత అంటూ నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## యాడ అమ్మినా ఊరుకోకండి

అదే సమయంలో మరో ట్వీట్‌లో చైనీస్ మాంజాపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. చైనీస్ మాంజా యాడ అమ్మినా ఊరుకోకండి. పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి. మీరు కొనకండి, పక్కవాళ్లను కూడా కొననివ్వకండి అంటూ స్పష్టం చేశారు. చైనీస్ మాంజా కేవలం దారం కాదని, అది మనుషుల పాలిట యమపాశమని, పక్షుల గొంతు కోసే రక్కసి అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం నిషేధించిన చైనీస్ మాంజాను వాడితే కఠిన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

# సంక్రాంతి ప్రయాణికులకు రైల్వే శాఖ కానుక

సికింద్రాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పింది. తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్ - విజయవాడ మార్గంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు 10 అదనపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లుగా ప్రకటించింది. సాధారణంగా పండుగ సమయాల్లో రెగ్యులర్ రైళ్లన్నీ నెలల ముందే నిండిపోవడంతో, సొంతూళ్లకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిణామంతో తాజాగా రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం పట్ల ప్రయాణికులకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఈ నెల 11, 12, 13, 18, 19వ తేదీల్లో ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని ఇవి ప్రతిరోజూ ఉదయం 6:10 గంటలకు హైదరాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కోసం ఈ నెల 10, 11, 12, 17, 19వ తేదీల్లో మధ్యాహ్నం 2:40 గంటలకు విజయవాడ నుంచి ట్రైన్లు బయలుదేరుతాయని సౌత్ సెంట్రల్ రైల్వేస్ అధికారులు పేర్కొన్నారు. తాజాగా ఈ ప్రత్యేక రైళ్లలో కేవలం రిజర్వేషన్ ఉన్నవారే కాకుండా, సాధారణ ప్రయాణికులకు కూడా ప్రాధాన్యతనిచ్చారు. కాగా, ఈ ట్రైన్లలో చైర్ కార్, జనరల్ బోగీలు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయి.





# మియాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్



హైదరాబాద్, జనవరి 10 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగరంలో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా, మియాపూర్ ప్రాంతంలో అత్యంత విలువైన భూమిని కాపాడింది. మియాపూర్ విలేజ్ పరిధిలోని మక్తా మహబూబ్‌పేటలో సాగుతున్న భారీ కబ్జా యత్నాలను హైడ్రా అధికారులు భగ్నం చేశారు. తాజాగా చేపట్టిన ఈ ఆపరేషన్ ద్వారా సుమారు 15 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం ఈ భూమి విలువ 3 వేల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. మియాపూర్ మక్తా మహబూబ్‌పేటలోని సర్వే నంబర్ 44 లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని గతంలోనే 'హైడ్రా ప్రజావాణి'కి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. నిజానికి గతంలోనే ఇదే సర్వే నంబర్‌లో ఉన్న 5 ఎకరాల భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. అలాగే మియాపూర్ -- బాచుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా ఉన్న చెరువు కట్టపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన 18 షట్టర్లను కూడా అధికారులు గతంలోనే తొలగించారు. ఇటీవల మక్తా మహబూబ్‌పేట భూములకు సంబంధించి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు, సంబంధిత సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్ ఉదంతాల నేపథ్యంలో హైడ్రా మరోసారి లోతైన విచారణ చేపట్టింది. సర్వే నంబర్ 44 లోని సుమారు 43 ఎకరాల ప్రభుత్వ భూమిని తప్పుడు పత్రాల సాయంతో కబ్జా చేసేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నట్లు అధికారులు నిర్ధారించుకున్నారు. ముఖ్యంగా సర్వే నంబర్ 159 కి చెందిన పత్రాలను చూపిస్తూ, సర్వే నంబర్ 44 లోని ఎకరన్నర ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై ఇప్పటికే కేసు నమోదు చేశారు. తాజా ఆపరేషన్లో భాగంగా స్వాధీనం చేసుకున్న 15 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా అధికారులు పక్కాగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఇక్కడ కబ్జాలకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ భారీ బోర్డులను ఏర్పాటు చేశారు. విలువైన భూమిని కాపాడటమే కాకుండా, అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించిన అధికారులపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో స్థానికంగా ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.



# ముగ్గులు ఎందుకంటే..




ప్రాణికోటికి ప్రత్యక్షంగా కనిపిస్తూ, వెలుగును అనుగ్రహించే దైవం సూర్యుడు. ఈ సృష్టి మనుగడకు ఆయనే మూల కారకుడు. దివాకరుడికి స్వాగతం పలుకుతూ చేసుకునేదే సంక్రాంతి పండుగ. ధనుర్మాసం నుంచి సంక్రాంతి శోభ మొదలవుతుంది. దక్షిణాయనం, ఉత్తరాయణం సంధికాలం ఈ ధనుర్మాసం. రానున్న ఉత్తరాయణ పుణ్యకాలానికి ఆరంభ సూచకంగా, ప్రత్యక్ష నారాయణుడికి ఆహ్వానం పలుకుతూ ముంగిళ్లను ముగ్గులతో అలంకరించే సంప్రదాయం ఏర్పడింది. తొలి సంధ్య వేళలో లేలేత సూర్యకిరణాలు వాకిట్లో విస్తృతంగా ప్రసరిస్తాయి. ఈ సమయంలో ముగ్గులు వేయడం వల్ల ఆరోగ్యానికి అవసరమయ్యే సూర్యశక్తి లభిస్తుంది. అంతేకాదు, నడుం వంచుతూ, కూర్చుంటూ, లేస్తూ, చేతులు ఆడిస్తూ ముగ్గు పెట్టేక్రమంలో శారీరక వ్యాయామం కూడా జరుగుతుంది.

ముఖ్యంగా చలి అధికంగా ఉండే ధనుర్మాసంలో సూర్యకాంతి చాలా అవసరం. ఈ మేరకు సంక్రాంతి వేళ ముగ్గులు పెట్టే సంప్రదాయం తప్పనిసరి చేశారు మన పెద్దలు. ముంగిలిని నిర్మల ఆకాశానికి ప్రతీకగా భావిస్తారు. ముగ్గుకోసం వేసే చుక్కలను నక్షత్రాలుగా, వాటిని కలుపుతూ వేసే గీతలు ఖగోళంలో మార్పులుగా భావిస్తారు. ముగ్గు కేంద్రకాన్ని సూర్యుడికి సంకేతంగా చెబుతారు. సంక్రాంతి నాడు సూర్యభగవానుణ్ని ఆహ్వానిస్తూ రథం ముగ్గును విధిగా వేస్తారు. ఇలా ముగ్గుల వెనుక ప్రాధాన్యాన్ని తెలియజేశారు మన పెద్దలు. అంతేకాదు, వాకిట్లో పేడనీళ్లతో చల్లే కళ్లాపి క్రిమికీటకాలకు విరుగుడుగా పని చేస్తుంది. ముగ్గుపిండి కూడా అందుకు తోడ్పడుతుంది.

# నేటినుండి భారత్ న్యూజిలాండ్ వన్డే సిరీస్

టీ20 ప్రపంచ కప్ ప్రారంభానికి ముందు, భారత క్రికెట్ జట్టు న్యూజిలాండ్‌తో స్వదేశంలో తమ సన్నద్ధతను పరీక్షించుకోనుంది. రెండు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది, ఆ తర్వాత మ్యాచ్‌లు ఉంటాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లు ఉండటంతో ఈ సిరీస్ ప్రత్యేకంగా మారింది. విజయ్ హజారే ట్రోఫీలో అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించిన తర్వాత, ఈ స్టార్ ఆటగాళ్లు అంతర్జాతీయ వేదికపై కూడా తమ సత్తా చాటుతారని అభిమానులు ఆశిస్తున్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే జనవరి 11, ఆదివారం నాడు జరగనుంది. ఈ మ్యాచ్ సిరీస్‌ను ప్రారంభిస్తుంది. రెండు జట్లు విజయంతో ప్రారంభించాలని చూస్తున్నాయి.భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే జనవరి 11, ఆదివారం నాడు జరగనుంది. ఈ మ్యాచ్ సిరీస్‌ను ప్రారంభిస్తుంది. రెండు జట్లు విజయంతో ప్రారంభించాలని చూస్తున్నాయి. మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతుంది. టాస్ అరగంట ముందు అంటే మధ్యాహ్నం 1:00 గంటలకు వేస్తారు.భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే తొలి వన్డే మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్షంగా ప్రసారం చేస్తారు. అభిమానులు స్టార్ స్పోర్ట్స్ 1 ఛానెల్‌లో ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూడవచ్చు. భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన ఇటీవలి వన్డే మ్యాచ్‌ల గురించి మాట్లాడితే, టీమ్ ఇండియాదే పైచేయిగా ఉంది. గత ఐదు వన్డే మ్యాచ్‌లలో భారత్ అన్ని మ్యాచ్‌లను గెలిచింది, కొన్ని విజయాలు కూడా పెద్ద తేడాతో నమోదయ్యాయి. ఇది భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని ఖచ్చితంగా పెంచుతుంది.





## రెండు జట్ల స్క్వాడ్‌లు

భారత్ జట్టు ఇదే - శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్ (వైస్-కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, నితీష్ కుమార్ రెడ్డి, రిషబ్ పంత్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కెఎల్ రాహుల్, రోహిత్ శర్మ, వాషింగ్టన్ సుందర్.

న్యూజిలాండ్ టీం- మైఖేల్ బ్రాస్‌వెల్ (కెప్టెన్), ఆదిత్య అశోక్, జోష్ క్లార్క్సన్, డెవాన్ కాన్వే, జాక్ ఫౌల్క్స్, మిచెల్ హే, నిక్ కెల్లీ, డారిల్ మిచెల్, హెన్రీ నికోల్స్, జేడెన్ లెనోక్స్, గ్లెన్ ఫిలిప్స్, మైఖేల్ రే, విల్ యంగ్, కైల్ జేమీసన్, క్రిస్టియన్ క్లార్క్.



## చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యధిక పరుగులు బాదిన భారత క్రికెటర్‌గా నిలిచింది. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 20 పరుగులు చేసిన హర్మన్ ఈ రికార్డు సాధించింది. ఈ క్రమంలోనే యంగ్ బ్యాటర్ షఫాలీ వర్మను హర్మన్ అధిగమించింది.నవీ ముంబయి వేదికగా ముంబయి- ఆర్సీబీ మ్యాచ్‌తో ఈ ఎడిషన్ డబ్ల్యూపీఎల్ షురూ అయ్యింది. ఈ మ్యాచ్‌లో ముంబయి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఇందులో హర్మన్ దూకుడుగా ఆడే క్రమంలో 20 పరుగులకు పెవిలియన్ చేరింది. అయితే అంతకంటే ముందే 15 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద హర్మన్ ఈ ఘనత అందుకుంది. దీంతో హర్మన్ (871 పరుగులు) డబ్ల్యూపీఎల్‌లో అత్యధిక పరుగుల సాధించిన భారత క్రికెటర్‌గా నిలిచింది. ఆమె తర్వాత దిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ షఫాలీ వర్మ (865 పరుగులు) రెండో స్థానంలో కొనసాగుతోంది.కాగా, 2023లో డబ్ల్యూపీఎల్ ప్రారంభమైంది. ఇందులో హర్మన్ ఇప్పటిదాకా 28 మ్యాచ్‌ల్లో 39.59 సగటుతో 871 పరుగులు చేసింది. ఇందులో 8 హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. 95 పరుగులు అత్యధిక స్కోర్‌గా ఉంది. అటు షఫాలీ వర్మ 27 మ్యాచ్‌ల్లో 36 సగటుతో 865 పరుగులు చేసింది. ఇందులో ఆరు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే ఓవరాల్‌గా ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన లిస్ట్‌లో నాట్ సీవర్ టాప్‌లో ఉంది. ఆమె 30 మ్యాచ్‌ల్లో 1031 పరుగులు చేసింది. అలాగే ఈ టోర్నీలో ఇప్పటిదాకా 1000 రన్స్ మార్క్ అందుకున్న ఏకైక క్రికెటర్ కూడా నాట్ సీవరే. ఇదే మ్యాచ్‌లో ఆర్సీబీ బౌలర్ లారెన్ బెల్ కూడా అరుదైన ఘనత సాధించింది. బుల్లెట్‌లాంటి బంతులతో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టడంలో సక్సెస్ అయ్యింది. ఆమె నాలుగు ఓవర్ల స్పెల్‌లో 3.50 ఎకనామీతో 14 పరుగులే ఇచ్చి 1 వికెట్ తీసుకుంది. ఇందులో ఒక మెయిడెన్ కూడా ఉండడం విశేషం. అలాగే తన స్పెల్‌లో ఏకంగా 19 బంతులను డాట్ బాల్స్‌గా మలిచింది.ఈ క్రమంలోనే లారెల్ అద్భుత ఘతన అందుకుంది. మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక డాట్ బాల్స్ వేసిన రెండో బౌలర్‌గా నిలిచింది. అయితే ఈ రికార్డు షబ్నిమ్ ఇస్మాయిల్ పేరిట ఉంది. ముంబయి ఇండియన్స్ తరపున ఇస్మాయిల్ సింగిల్ ఇన్నింగ్స్‌లో 20 బంతులను డాట్ బాల్స్‌గా మలిచింది. ఇక మ్యాచ్‌విషయానికొస్తే, ఆర్సీబీ ఉత్కంఠ విజయం అందుకుంది. 155 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ 7 వికెట్ల నష్టానికి ఓవర్లన్నీ (20) ఆడి అందుకుంది. ముఖ్యంగా ఆఖరి ఓవర్లో 18 పరుగులు చేయాల్సిన దశలో నదైన్ డి క్లెర్క్ (63లి పరుగులు) అద్భుతంగా పోరాడింది. తొలి రెండు బంతులు డాట్ ఆడినా, ఆ తర్వాత నాలుగు బంతులకు వరుసగా 6,4,6,4 బాది ఆర్సీబీకి అద్భుతమైన విజయం అందించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లలో 154-6 స్కోర్ చేసింది. సజీవన్ సజన (45 పరుగులు, 25 బంతుల్లో), నికొలే కేరీ (40 పరుగులు) రాణించారు.

## ఇండియాలో బంగ్లాదేశ్ ఆడాల్సిందే




వచ్చే నెలలో ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ 2026కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. అయితే బంగ్లాదేశ్ మాత్రం తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు తరలించాలని పట్టుబడుతోంది. ఈ వివాదం వెనుక అసలు కథ ఐపీఎల్ వేలంతో మొదలైంది. కోల్‌కతా నైట్ రైడర్స్ రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసిన బంగ్లా ఫాస్ట్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను వదిలేయాలని బీసీసీఐ ఆదేశించింది. పొరుగు దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, మైనారిటీలపై దాడుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు.ముస్తాఫిజుర్‌ను పంపేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బంగ్లాదేశ్, తమ ఆటగాళ్లకు భారత్‌లో రక్షణ ఉండదని ఆరోపిస్తూ ఐసీసీకి రెండు లేఖలు రాసింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకలోని కొలంబోకు మార్చాలని కోరింది. అయితే బెంగళూరులో జరిగిన ఒక సమావేశం తర్వాత బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. బంగ్లాదేశ్ అభ్యర్థనలో పస లేదని తేల్చి చెప్పారు. ఐసీసీ కూడా బంగ్లాదేశ్‌కు స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. భారత్‌లో భద్రతా పరమైన ముప్పు ఏమీ లేదని, షెడ్యూల్ ప్రకారం కోల్‌కతా, ముంబైలలో ఆడాల్సిందేనని స్పష్టం చేసింది.బంగ్లాదేశ్ జట్టు కోల్‌కతాలో మూడు, ముంబైలో ఒక మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఒకవేళ భద్రత కారణాలు చెబుతూ భారత్‌కు రాకపోతే, ఆ మ్యాచ్ పాయింట్లను ప్రత్యర్థి జట్లకు కేటాయిస్తామని ఐసీసీ హెచ్చరించినట్లు సమాచారం. పాకిస్థాన్ కోసం అమలు చేసిన హైబ్రిడ్ మోడల్ తమకు కూడా వర్తింపజేయాలని బంగ్లాదేశ్ కోరినప్పటికీ, ఐసీసీ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. బీసీసీఐ ఇప్పటికే క్రీడాకారులకు అత్యున్నత స్థాయి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది.బంగ్లాదేశ్ క్రీడా శాఖ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ఈ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. దేశ గౌరవాన్ని పణంగా పెట్టి భారత్‌లో ఆడబోమని ఆయన ప్రకటించారు. మరోవైపు బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారాలను కూడా నిషేధించారు. ఈ పరిణామాలు రెండు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఐసీసీ అధ్యక్షుడు జై షా నేతృత్వంలో ఈ సమస్య ఎలా పరిష్కారం అవుతుందో చూడాలి. ఫిబ్రవరి 7 నుంచి టోర్నీ మొదలుకానుండటంతో, బంగ్లాదేశ్ తన తుది నిర్ణయాన్ని ఈ వారంలోనే ప్రకటించే అవకాశం ఉంది.

## కీలక రికార్డ్స్‌పై హిట్‌మ్యాన్ కన్ను



2025 ఏడాదిని ఘనంగా ముగించిన టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ కొత్త సంవత్సరంలో బరిలో దిగేందుకు రెడీ అయ్యాడు. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో హిట్‌మ్యాన్ ఆడనున్నాడు. జనవరి 11న వడోదర వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో రోహిత్ శర్మ తాజాగా వడోదరకు చేరుకున్నాడు. అయితే కొత్త ఏడాదిలో హిట్?మ్యాన్ పలు రికార్డులు అందుకునే ఛాన్స్ ఉంది. అందులో ఒకట్రెండు ఘనతలు ఈ సిరీస్?లోనే సాధించే అవకాశం ఉంది. రోహిత్ శర్మ ఇప్పటిదాకా 279 వన్డే మ్యాచ్?ల్లో 49.21 సగటుతో 11516 పరుగులు చేశాడు. మరో 484 రన్స్ చేస్తే వన్డేల్లో 12వేల పరుగుల క్లబ్‌లో చేరతాడు. దీంతో ఈ మైలురాయి అందుకున్న భారత మూడో క్రికెటర్‌గా రోహిత్ అరుదైన ఘనత ఖాతాలో వేసుకుంటాడు. భారత్ నుంచి ఇప్పటిదాకా దిగ్గజం సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ ఇద్దరే వన్డేల్లో ఈ మార్క్ అందుకున్నారు. ఓవరాల్‌గా ఏడో బ్యాటర్‌గా నిలుస్తాడు.అలాగే మరో 224 పరుగులు చేస్తే, పాకిస్థాన్ మాజీ క్రికెటర్ ఇంజమామ్ ఉల్ హక్ (11739 పరుగులు)ను అధిగమిస్తాడు. ఇంకో 63 పరుగులు చేస్తే సౌతాఫ్రికా దిగ్గజం జాక్ కలీస్ (11579 పరుగులు) ను దాటేస్తాడు. ఈ ఇద్దరినీ ఇదే సిరీస్?లో దాటేసే అవకాశం ఉంది.ఇంటర్నేషనల్ వన్డే కెరీర్‌లో హిట్‌మ్యాన్ ఇప్పటిదాకా 96సార్లు 50ం స్కోర్లు నమోదు చేశాడు. ఇందులో 33 సెంచరీలు, 61 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే మరో ఆరు 50ం స్కోర్లు నమోదు చేస్తే, వన్డే కెరీర్‌లో 100సార్లు 50ం స్కోర్లు చేసిన బ్యాటర్‌గా అరుదైన రికార్డు సాధిస్తాడు.వన్డే కెరీర్‌లో రోహిత్ శర్మ ఇప్పటిదాకా 355 సిక్స్?లు బాదాడు. ప్రస్తుతం వన్డేల్లో అత్యధిక సిక్స్?లు బాదిన బ్యాటర్‌గా రోహిత్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే మరో 45 సిక్స్?లు బాదితే వన్డేల్లో 400 సిక్స్‌ల మార్క్ అందుకున్న తొలి క్రికెటర్?గా నిలుస్తాడు. 18ఏళ్ల సుదీర్ఘ ఇంటర్నేషనల్ కెరీర్‌లో రోహిత్ ఇప్పటిదాకా మూడు ఫార్మాట్లలో కలిపి 50 శతకాలు నమోదు చేశాడు. మరో ఈ లిస్ట్‌లో పదో స్థానంలో ఉన్నాడు. క్రికెట్‌లో దిగ్గజాలు బ్రియన్ లారా (53), మహేల జయవర్ధనే (54), హాషీమ్ ఆమ్లా (55)కు మరో 5 సెంచరీల దూరంలో ఉన్నాడు. ఈ ఏడాది ఇంకో 6 శతకాలు బాదితే వీళ్లను అధిగమించి ఏడో స్థానానికి దూసుకెళ్లే ఛాన్స్ ఉంది.

## గుజరాత్ జెయింట్స్ శుభారంభం




2026 మహిళల ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్ జెయింట్స్ శుభారంభం చేసింది. ఈ లీగ్?లో భాగంగా శనివారం నవీ ముంబయి వేదికగా యూపీ వారియర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 10 పరుగుల తేడాతో నెగ్గింది. 208 భారీ ఛేదనలో యూపీ ఓవర్లన్నీ ఆడి 8 వికెట్లకు 197 పరుగులకే పరిమితమైంది. లిచీఫీల్డ్ (78 పరుగులు) పోరాడింది. చివర్లో ఆశ శోభన (27 పరుగులు) మెరుపులు మెరిపించిన ఫలితం లేదు. గుజరాత్ బౌలర్లలో రేణుకా సింగ్ ఠాకూర్, సోఫీ డివైన్, వేర్?హమ్ తలో 2, గార్డ్?నర్, గైక్వాడ్ చెరో 1 వికెట్ పడగొట్టారు.తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. గుజరాత్ జెయింట్స్ బ్యాటర్లు ఆరంభం నుంచే యూపీ బౌలర్లపై విరుచుకుపడ్డారు. గుజరాత్ కెప్టెన్ ఆష్లే గార్డనర్ కేవలం 41 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 65 పరుగులు చేసి జట్టును ముందుండి నడిపించారు. అనుష్క శర్మ అరంగేట్రం మ్యాచ్‌లోనే 30 బంతుల్లో 7 ఫోర్లతో 44 పరుగులు చేసి ఆశ్చర్యపరిచారు. సోఫీ డివైన్ మెరుపు ఆరంభాన్నిస్తూ 20 బంతుల్లోనే 38 పరుగులు జోడించారు. చివరిలో జార్జియా వేర్‌హామ్ (27), భారతి ఫుల్‌మాలీ (14) వేగంగా ఆడటంతో గుజరాత్ 200 పరుగుల మార్కును దాటింది. యూపీ బౌలర్లలో సోఫీ ఎక్లెస్టోన్ 2.. శిఖా పాండే, డాటిన్ చెరో వికెట్ తీశారు.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన యూపీ వారియర్స్‌కు ఓపెనర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆశలు రేకెత్తించారు. లిచ్‌ఫీల్డ్ కేవలం 40 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో 78 పరుగులు చేసి పెవిలియన్ చేరారు. కెప్టెన్ మెగ్ లానింగ్ (30), శ్వేతా షెరావత్, ఆశా శోభన రాణించినప్పటికీ.. గుజరాత్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లక్ష్యానికి 11 పరుగుల దూరంలో నిలిచిపోయారు. గుజరాత్ బౌలర్లలో జార్జియా వేర్‌హామ్, సోఫీ డివైన్, రేణుకా సింగ్ ఠాకూర్ తలో రెండు వికెట్లు తీశారు.

## అనుష్క శర్మ విధ్వంసం..



మహిళా క్రికెట్ ప్రపంచంలో ఒక కొత్త స్టార్ ఉదయించింది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ రెండో మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌తో జరిగిన పోరులో గుజరాత్ జెయింట్స్ యువ సంచలనం అనుష్క శర్మ తన బ్యాట్‌తో గర్జించింది. తొలి మ్యాచ్‌లోనే ఏమాత్రం బెదురు లేకుండా ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడిన ఈ 22 ఏళ్ల కుట్టి, స్టేడియాన్ని హోరెత్తించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న యూపీ వారియర్స్ నిర్ణయం తప్పని నిరూపిస్తూ, గుజరాత్ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ముఖ్యంగా అనుష్క శర్మ ఇన్నింగ్స్ ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఈ ఆల్‌రౌండర్, మూడో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చి గ్రౌండ్ నలుమూలలా షాట్లు ఆడింది. కేవలం 30 బంతుల్లోనే 44 పరుగులు సాధించి డెబ్యూ మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకుంది. ఇందులో ఏకంగా 7 ఫోర్లు ఉన్నాయి. ఆమె స్ట్రైక్ రేట్ 146.66గా ఉండటం విశేషం. స్టార్ ప్లేయర్ యాష్ గార్డ్‌నర్‌తో కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 103 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, గుజరాత్ జట్టు స్కోరును 200 దాటించడంలో కీలక పాత్ర పోషించింది. అనుష్క మెరుపు ఇన్నింగ్స్ పుణ్యమా అని గుజరాత్ జెయింట్స్ నిర్ణీత ఓవర్లలో 207 పరుగుల భారీ స్కోరు సాధించింది. మెగా వేలంలో అనుష్క శర్మ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. చివరికి 45 లక్షల రూపాయలకు గుజరాత్ జెయింట్స్ ఆమెను సొంతం చేసుకుంది. తన బేస్ ప్రైస్ కంటే 4.5 రెట్లు ఎక్కువ ధర పలికిన అనుష్క, తనపై యాజమాన్యం పెట్టుకున్న నమ్మకాన్ని మొదటి మ్యాచ్‌లోనే నిలబెట్టుకుంది. అండర్-19 లెవల్ నుంచే తన ఆటతీరుతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈమె, ఇప్పుడు పెద్దల లీగ్‌లోనూ తన సత్తా చాటుతోంది. అనుష్క శర్మ కేవలం డబ్ల్యూపీఎల్‌లో మాత్రమే కాదు.. దేశవాళీ క్రికెట్‌లోనూ అదరగొడుతోంది. ఇటీవల జరిగిన సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ ట్రోఫీలో సెంట్రల్ జోన్ తరపున ఆడి 155 పరుగులు చేయడమే కాకుండా 7 వికెట్లు కూడా పడగొట్టింది. అలాగే సీనియర్ టీ20 ట్రోఫీలో మధ్యప్రదేశ్ తరపున 207 పరుగులు చేసి సెలెక్టర్ల దృష్టిలో పడింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించగల సామర్థ్యం ఉండటంతో ఆమె భారత మహిళా జట్టులోనూ త్వరలోనే చోటు దక్కించుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# ప్రజల జేబులు కొల్లగొట్టిన రాజాసాబ్

## తొలిరోజే 112 కోట్లు వసూళ్లు




రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో రూపొందిన హారర్ కామెడీ చిత్రం 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ సినిమా మొదటి రోజు వసూళ్లపై చిత్రబృందం తాజాగా స్పందించింది. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. దీంతో ఈ సినిమా తొలి రోజున ప్రపంచవ్యాప్తంగా రూ. 112 కోట్ల మార్కును దాటేసి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. బాహుబలి 2, సాహో, ఆదిపురుష్, సలార్, మరియు కల్కి చిత్రాల తర్వాత ప్రభాస్ ఖాతాలో చేరిన ఆరో రూ. 100 కోట్ల ఓపెనర్ ఇది. దీంతో ఇండియాలో ఈ ఘనత సాధించిన ఏకైక హీరోగా ప్రభాస్ చరిత్ర సృష్టించారు. తెలుగు రాష్ట్రాల్లో రూ. 58 కోట్ల వసూళ్లను సాధించగా.. కర్ణాటక / ఇతర రాష్ట్రాలలో రూ. 18 కోట్లు, ఓవర్సీస్‌లో రూ.36 కోట్లు రాబట్టినట్లు సమాచారం.



## 12 వస్తోన్న మనశంకరవరప్రసాద్ గారు

### టిక్కెట్లు ధరల పెంపునకు సర్కార్ గ్రీన్ సిగ్నల్

'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో స్పెషల్ ప్రీమియర్‌తో పాటు, టికెట్ ధరలు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జనవరి 11న స్పెషల్ ప్రీమియర్‌కు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య షోను ప్రదర్శించాల్సి ఉంటుంది. జనవరి 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశం కల్పించింది. ఈ విషయాన్ని తెలుపుతూ జీవో జారీ చేసింది. ఈ చిత్రం టికెట్ ధరలు పెంచుకునేందుకు ఇప్పటికే ఏపీలో గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అక్కడ స్పెషల్ ప్రీమియర్ షో టికెట్ ధర రూ.500 కాగా (జీఎస్టీతో కలిపి).. సింగిల్ స్క్రీన్‌లో రూ.100 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.125 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశాన్ని ఏపీ ప్రభుత్వం కల్పించింది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

## చీరకట్టులో సమంత సోయగాలు..

సమంత.. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా భారీ పాపులారిటీ అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇటీవల రెండవ వివాహం చేసుకొని కొత్త జీవితాన్ని మొదలుపెట్టింది. గత ఏడాది డిసెంబర్ 1న ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ఈషా యోగ ఫౌండేషన్ సమీపంలో ఉన్న లింగ భైరవి సన్నిధిలో ఏడు అడుగులు వేసింది. వివాహం అనంతరం సినిమాలపై ఫోకస్ పెట్టింది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే ఈమె తెలుగులో నటిస్తున్న చిత్రం మా ఇంటి బంగారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై సహ నిర్మాతగా వ్యవహరిస్తూ ఉండగా.. ఈ చిత్రానికి సమంత భర్త రాజ్ నిడిమోరు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సమంతతో ఇదివరకే ఓ బేబీ సినిమా చేసిన డైరెక్టర్ నందిని రెడ్డి మరోసారి మా ఇంటి బంగారం అనే సినిమాకు దర్శకత్వం వహిస్తోంది. ఇక భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి జనవరి 9వ తేదీన ఈ సినిమా నుంచి టీజర్ ట్రైలర్ ను విడుదల చేశారు. ఇందులో సమంత ఒకవైపు కోడలిగా అత్తవారి మెప్పు పొందడానికి ప్రయత్నం చేస్తూనే.. మరొకవైపు యాక్షన్ పర్ఫామెన్స్ తో ఆకట్టుకుంది. ఈ టీజర్ ట్రైలర్ లాంచ్ లో భాగంగా థియేటర్లో సందడి చేసిన ఈమె తాజాగా అందుకు సంబంధించిన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. తెలుపు రంగు చీరకు గులాబీ వర్ణం కలిగిన బ్లౌజ్ ధరించి తన అందంతో మరింత ఆకట్టుకుంది. సింపుల్ జువెలరీతో తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసిన ఈమె మరింత సింపుల్గా అభిమానుల హృదయాలను దోచుకుంది. సమంతాను చాలా రోజుల తర్వాత ఇలా సంతోషంగా ఉండడం చూసి మనసుకు హాయిగా ఉంది అంటూ అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా సమంత మోములో స్వచ్ఛత అభిమానులనే కాదు నెటిజన్లను కూడా ఆకర్షిస్తోంది.ప్రస్తుతం సమంత షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.



## అందమైన ఆషీకా రంగనాధ్ అంత బోల్డ్ గానా?

దక్షిణాది హీరోయిన్లు అంటే బోల్డ్ పాత్రలకు అంత ఈజీగా కన్విన్స్ అవ్వరు. వీలైనంతవరకూ ఆ తరహా పాత్రలకు దూరంగా ఉండటానికే ప్రయత్నిస్తారు. దర్శకుడు తప్పదని పట్టుబడితే తప్ప అంగీకరించారు. అదీ పరిమితులకు లోబడే పని చేస్తామంటారు. అతిగా డిమాండ్ చేస్తే ప్రాజెక్ట్ ను వదులకోవడానికి వెనుకాడరు. ప్రత్యేకించి కన్నడ భామల్ని కన్విన్స్ చేయడం అంతకన్నా సులభం కాదు. కానీ ఓ నటి ఏరి కోరి మరి బోల్డ్ పాత్రను ఎంచుకుంది. పద్ధతిగా చీర కట్టుకుని తెలుగు ఆడపడుచులా కనిపించే పాత్ర కావాలా? చిట్టిపొట్టి దుస్తుల్లో కుర్రాళ్లను కవ్వించే రోల్ కావాలా? అంటే చీర పాత్రలో ఏమంటుంది? రోటీనిటీ తప్ప కురచ దుస్తుల్లో అయితే వందశాతం న్యాయం చేస్తానంటూ ముందుకొచ్చిందో నటి. ఇంతకీ ఎవరా చిచ్చర పిడుగు అనుకుంటున్నారా? ఆమె ఎవరో కాదు బ్యూటీఫుల్ కన్నడ బ్యూటీ ఆషీకా రంగనాథ్. నాగార్జున హీరోగా నటించిన 'నా సామిరంగ'లో జోడీగా మెప్పించిన అమ్మడికి ఆ తర్వాత హిట్ పడని సంగతి తెలిసిందే. చేసిన సినిమాలేవి కలిసి రాలేదు. ఈ క్రమంలో మాస్ రాజా రవితేజ హీరోగా కిషోర్ తిరుమల తెరకెక్కించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' లో ఛాన్స్ అందుకుంది. ఇందులో ఇద్దరు హీరోయిన్లు ఉండగా? ఓ హీరోయిన్గా ఆషీకా రంగనాథ్ ఎంపికైంది. మరో హీరోయిన్ గా డింపుల్ హయతిని తీసుకున్నారు. ఈ కథ చెప్పడానికి వెళ్లినప్పుడు దర్శకుడు హీరో ప్రియురాలి పాత్ర బోల్డ్ గా ఉంటుంది? మరో పాత్ర అదే హీరోకు భార్యగా నటించాలి. రెండిటిలో ఏ పాత్ర తీసుకుంటారు? మీ ఇష్టంపైనే ఆధారపడి ఉందని ఛాన్స్ ఆషీకా చేతుల్లోనే పెట్టాడు. అందుకు ఆషీకా రంగన్నాద్ గత సినిమాల్లో చీర కట్టుకుని పద్ధతిగా భార్యామణి పాత్రలు పోషించానని చెప్పి ఆ బోల్డ్ రోల్ లో నటిస్తానని ఓపెన్ గా చెప్పేసింది. సినిమాలో మానస శెట్టి అనే పాత్రలో కనిపించనుంది. స్పెయిన్ లో ఉన్న ఓ పెద్ద స్పిరిట్ కంపెనీ ఎండీ తను. స్ట్రాంగ్ బోల్డ్ గర్ల్ గా ఉంటుందా రోల్. ఈ తరం మోడ్రన్ గాళ్ గా కనిపిస్తానంది. కెరీర్ లోనే ఇంత బోల్డ్ పాత్ర ఇప్పటి వరకూ పోషించలేదని తెలిపింది. ఈ సినిమా తన తర్వాత కొత్త ఇమేజ్ ఏర్పడుతుందని ఆషీకా ధీమా వ్యక్తం చేసింది. మరో అమ్మాయికి భర్తగా ఉన్న వ్యక్తి జీవితంలోకి తానెళ్లిన తర్వాత జరిగిన పరిణామాలు ఏంటి? అన్నది ఓ పాయింట్ గా హైలైట్ అవుతుందని తెలిపింది. కిషోర్ తిరుమల క్లాసిక్ డైరెక్టర్ అయినా? సీన్ డిమాండ్ చేసిందంటే రాజీ పడే దర్శకుడు కాదు. బోల్డ్ సన్నివేశాన్ని రక్తికట్టించడంలోనూ అంతే సమర్ధుడు. మరి కన్నడ బ్యూటీని ఏ రేంజ్ లో ఆవిష్కరిస్తున్నాడో చూడాలి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463